మళ్లీ షాపుల లొల్లి

- సూర్యతేజనగర్‌లో అనధికారికంగా దుకాణాల ఏర్పాటు
- బరితెగించిన స్థానిక టీడీపీ నాయకులు
- పట్టించుకోని అధికారులు, సచివాలయ సిబ్బంది



సూర్యతేజనగర్‌లో అనధికారికంగా ఏర్పాటు చేసిన షాపులకు అమర్చుతున్న షట్టర్లు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు సూర్యతేజనగర్‌లో షాపుల లొల్లి మళ్లీ మొదలైంది. రెండు నెలల కిందట ఇక్కడ షాపుల ఏర్పాటుకు బ్రేక్ పడింది. ఇప్పుడు టీడీపీ నాయకులు అనధికారికంగా షాపులు ఏర్పాటు చేస్తున్నారు. రాజీవ్ ఆవాస్ యోజన(రే) పథకంలో భాగంగా ఇక్కడ 204 మందికి వ్యక్తిగత నివాసాలు, జీ ప్లస్ వన్ నివాసాలు జీవీఎంసీ కేటాయించింది. వ్యక్తిగత నివాసాల్లో కొందరు రెండేసి ఫ్లోర్లు అనధికారికంగా వేసేశారు. అంతటితో ఆగకుండా రోడ్డు పక్కన ఉన్న ఆ కాలనీ స్థలాన్ని పెద్దలుగా చలామణి అవుతున్న కొందరు టీడీపీ నాయకులు వ్యాపారం కోసం షాపులు నిర్మించేస్తున్నారు. రెండు నెలల క్రితం ఓ వ్యక్తి రెండు షాపులు నిర్మిస్తే జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సచివాలయ సిబ్బందితో కలసి వాటికి వేసిన షటర్లు తొలగించి అడ్డంగా గోడలు నిర్మించారు. ఇప్పుడు వాటి పక్కనే మరో వ్యక్తి రోడ్డు వైపు దర్జాగా షట్టర్లు, గేట్లు పెట్టి షాపులు నిర్మించేస్తున్నాడు. అప్పుడు షాపులకు బ్రేక్ వేసిన జీవీఎంసీ అధికారులు వీటికి అడ్డు చెప్పడం లేదు. స్థానిక సచివాలయం సిబ్బంది కూడా వాటి జోలికి వెళ్లలేదు.

రే పథకం నిబంధనలకు తూట్లు

రాజీవ్ ఆవాస్ యోజన(రే) పథకం ప్రణాళిక ప్రకారం ఇక్కడ నివాసాలకు ప్రధాన రహదారి వైపు ద్వారాలు ఏర్పాటు చేయకూడదు. ఇక్కడ కొందరు టీడీపీ నాయకులు మాత్రం ఆ నిబంధనలను పక్కన బెట్టి స్థానిక ఎమ్మెల్యే కట్టుకోమన్నారంటూ జీవీఎంసీ అధికారులను మభ్యపెడుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. రెండు నెలల కిందట ఈ కాలనీలో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఇక్కడ రోడ్డు వైపు షట్టర్లు ఏర్పాటు చేసి ఎలాంటి షాపులు నిర్మించవద్దని స్థానికులను హెచ్చరించారు. వాటిని సైతం వీరు పక్కనపెట్టి అనధికారికంగా షాపులు నిర్మిస్తుండటం విశేషం. రెండు నెలల కిందట కొందరు చేపట్టిన షాపుల నిర్మాణాన్ని అడ్డుకొని ఇప్పుడు వీళ్లకు ఎలా అవకాశం ఇస్తున్నారో అంటూ జీవీఎంసీ అధికారులపై స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజలపై ధరల భారం తగ్గించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలపై నిత్యావసర సరకుల ధరల భారం మోపిందని, తక్షణమే ఈ భారాన్ని తగ్గించాలని సీపీఎం మద్దిలపాలెం జోన్ కమిటీ నాయకుడు పెంటకోట వెంకటరావు డిమాండ్ చేశారు. జోన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మద్దిలపాలెంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరకుల ధరలపై కంట్రోల్ ఎత్తివేయడం వల్లే ధరలు పెరుగుతున్నాయన్నారు. చౌక దుకాణాల ద్వారా బియ్యం, కందిపప్పు, పంచదార, వంటనూనె మొదలైన సరకులను తక్కువ ధరకు ప్రజలకు ఇవ్వాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. మరోపక్క ట్రూ అప్ చార్జీల సర్దుబాటు పేరుతో రూ.8,000 కోట్ల భారాన్ని ప్రజలపై వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం సరికాదన్నారు. తక్షణం పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి ప్రభుత్వరంగంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నామని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. జోన్ కమిటీ సభ్యులు కె.కుమారి, ఎం.చంటి, సీపీఎం సీనియర్ నాయకులు జి.బి.ఎస్.చలపతి, కుమార్ మంగళం, పీతల అప్పారావు, అనపర్తి అప్పారావు, ఆర్.శ్రీను, జోన్ నాయకులు పాల్గొన్నారు.

నిరసనల్లో భాగం కండి



రామ్‌నగర్‌లో ప్రజలను చైతన్యపరుస్తున్న సీపీఎం నాయకులు

బీచ్‌రోడ్డు: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రతి తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నుంచి నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ బి.గంగారావు తెలిపారు. పార్టీ నేత కె.నర్సింగరావు అధ్యక్షతన బుధవారం 28వ వార్డు రామ్‌నగర్‌లో పాదయాత్ర చేశారు. నిరసనల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తూ ఇంటింటా కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తన హామీలను, ఆరు గ్యారెంటీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుండా ప్రజలపై నిత్యావసర సరకుల ధరలు, విద్యుత్ చార్జీల భారం మోపిందని మండిపడ్డారు. చెత్త పన్ను ఇంతవరకు రద్దు చేయలేదని, గత ప్రభుత్వం పెంచిన ఆస్తి, ఆధారిత విలువ పన్నులు మళ్లీ పెంచడానికి కూటమి ప్రభుత్వం సిద్ధపడిందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.సుబ్బారావు, చంద్రమౌళి, చంద్రశేఖర్, సంతోష్‌కుమార్, దుర్గారావు, నూకరాజు సతీష్, రమణ తదితర నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయులకు 17న సత్కారం

మద్దిలపాలెం: ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన పాఠశాల ఉపాధ్యాయులను ఈ నెల 17న బాల వికాస్ ఫౌండేషన్, గాంధీ సెంటర్‌ల ఆధ్వర్యంలో సత్కరించనున్నామని ప్రతినిధి ప్రకాశ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు డాక్టర్ లంకపల్లి బులయ్య కళాశాల ఆవరణలోని గాంధీ సెంటర్ హాల్‌లో ఈ కార్యక్రమం జరగనుందన్నారు. సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, గాంధీ సెంటర్ అధ్యక్షుడు, నాగార్జున యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ అవార్డు గ్రహీతలను సత్కరించనున్నారని పేర్కొన్నారు.

తత్వ శాస్త్రంపై పట్టు సాధించాలి



తత్వ శాస్త్ర విభాగ విద్యార్థులతో ముచ్చటిస్తున్న బౌద్ధ భిక్షువు పూంటశ్వక్

విశాఖ విద్య: తత్వ శాస్త్రంపై విద్యార్థులు పట్టు సాధించాలని టిబెట్ బౌద్ధ భిక్షువు పూంటశ్వక్ సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ తత్వ శాస్త్ర విభాగాన్ని బుధవారం ఆయన సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి ప్రసంగించారు, దుఃఖం నుంచి విముక్తి పొందే మార్గాన్ని ప్రజలకు తెలియజేయడం తత్వ శాస్త్ర విద్యార్థుల బాధ్యతని తెలియజేశారు. బౌద్ధ ధర్మం మనిషిని దుఃఖ విముక్తుడిని చేస్తుందని, కోరికలను పరిమితంగా ఉంచడం ద్వారా ఇది సాధ్యమని పేర్కొన్నారు. ఈ మార్గాన్ని అనుసరించే వారు ప్రశాంతమైన జీవితం గడపవచ్చన్నారు. కార్యక్రమంలో ఏయూ తత్వ విభాగ అధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు, అధ్యాపకులు ముసుగు ప్రసాద్, అల్లాడ వీరభద్రరావు, దేవదానం శ్రీనివాసరావు, దాక్షాయిని, పద్మజ, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపక బృందం

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ఆవిష్కరించి మాట్లాడారు. వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాన్ని సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఐక్యూ కోఆర్డినేటర్ రవిబాబు, శ్రావణ్‌కుమార్, ఎస్.వి.రామారావు, పి.ధనలక్ష్మి, వై.శాంతిప్రభ, పోలా ఉమామహేశ్వరరావు, కళాశాల గ్రంథాలయాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

టూరిజం, స్మార్ట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేయండి



కొరియన్ ప్రతినిధులతో ఎంపీ శ్రీభరత్

ఏయూక్యాంపస్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విభిన్న వ్యాపార భాగస్వామ్యాలను స్వాగతిస్తుందని ఎంపీ ఎం.శ్రీ భరత్ అన్నారు. బుధవారం నోవాటెల్ హోటల్‌లో ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌ఏపీసీసీఐ) ఆధ్వర్యంలో రిపబ్లిక్ ఆఫ్ కొరియా(చెన్నై) కాన్సులేట్ జనరల్ చాంగ్ న్యున్ కిమ్‌తో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ విశాఖలో ఫుడ్ రెస్టారెంట్‌లు, టూరిజం, స్మార్ట్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలని కొరియన్ సంస్థలను కోరారు. ఎఫ్‌ఏపీసీసీఐ అధ్యక్షుడు కంకటాల మల్లికార్జున రావు మాట్లాడుతూ వీసాలకు సంబంధించిన సమస్యలు, ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక ఇంధనం తదితర అంశాలపై కాన్సులేట్ జనరల్‌తో చర్చించారు. కొరియన్ ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ సియో యంగ్ మూన్ పాల్గొన్నారు.

బయో డైవర్సిటీ పార్క్ సందర్శన



ఏవీఎన్ కాలేజీ విద్యార్థులకు మొక్కల గురించి వివరిస్తున్న రామమూర్తి

బీచ్‌రోడ్డు: ఏవీఎన్ కాలేజీ బోటనీ విభాగం విద్యార్థులు బుధవారం పెదవాల్తేరులోని బయో డైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. పార్క్ పర్యవేక్షకుడు రామమూర్తి విద్యార్థులకు వివిధ రకాల మొక్కల ప్రాముఖ్యాన్ని వివరించారు. తాను కూడా ఏవీఎన్ కళాశాలలో జువాలజీ లెక్చరర్‌గా మూడేళ్ల పాటు పనిచేసినట్లు గుర్తు చేశారు. ఆ కాలేజీ నుంచి విద్యార్థులు పార్క్‌ను సందర్శించి మొక్కల కోసం తెలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రి నాయుడు, అర్చన, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న పల్లా దుర్గారావు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు అన్నారు. వార్డుకు బదిలీపై వచ్చిన ఏఈ విల్సన్‌తో కలిసి ఆయన బుధవారం స్థానిక ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. యూజీడీకి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు చెప్పగా.. త్వరలోనే పనులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

వృద్ధాశ్రమాలకు వితరణ



ఓల్డేజ్ హోమ్‌కు సరకులు అందజేస్తున్న సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు

ఎంవీపీకాలనీ: సత్యసాయిబాబా 99వ జయంతిని పురస్కరించుకొని స్థానిక శ్రీసత్యసాయి విద్యావిహార్ విద్యార్థుల సేవా కార్యక్రమాలు కొనసాగాయి. మాధవధార వానప్రస్థ ఆశ్రమం, మధురవాడలోని వైజాగ్ ఓల్డేజ్ హోమ్‌లో బుధవారం వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఓల్డేజ్ హోమ్‌కు బియ్యం, పప్పు దినుసులు, నూనెలతో కూడిన వంట సామగ్రి, వృద్ధులకు దుస్తులు, దుప్పట్లు, టవళ్లతో కూడిన కిట్లు, పండ్లు అందజేశారు. 10వ తరగతి డీ సెక్షన్ విద్యార్థులు స్వయంగా సేకరించిన నిధులతో వీటిని సిద్ధం చేసి పంపిణీ చేశారు. విద్యావిహార్ ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

హోటళ్లలో కల్తీ ఆహారంపై అసెంబ్లీలో చర్చించాలి



మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న జన జాగరణ సమితి ప్రతినిధులు

మద్దిలపాలెం: కల్తీ ఆహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన సమస్యగా గుర్తించి అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేస్తూ జన జాగరణ సమితి ప్రతినిధులు బుధవారం మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ కల్తీ ఆహారం అమ్మేవారిని అరికట్టాలని, లేకుంటే ఆరోగ్యానికే ప్రమాదకరమన్నారు. హోటళ్లలో కల్తీ ఆహారం తిని క్యాన్సర్ బారిన పడకుండా ప్రజల ప్రాణాలను రక్షించాలని కోరారు. ఆహార భద్రతను గాలి కొదిలేసిన ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులపై విచారణ చేపట్టాలన్నారు. తూతూ మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులిపేసుకుంటున్న ఫుడ్ సేఫ్టీ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హోటళ్లలో కిచెన్, డీ ఫ్రిడ్జ్‌లను పరిశీలించిన తర్వాతే భోజనం చేయాలని రాష్ట్ర ప్రజలకు జన జాగరణ సమితి విజ్ఞప్తి చేస్తోందన్నారు. హోటళ్ల పరిసరాలు చాలా వరకూ అధ్వానంగా ఉంటున్నాయని, తాగునీరు కలుషితమవుతోందని, దీంతో నగరంలో టైఫాయిడ్ జ్వరాలు విజృంభిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆహార పదార్థాలు విక్రయించే వారు కనీస భద్రత చర్యలు చేపట్టడం విస్మరించారని దుయ్యబట్టారు. కల్తీ ఆహారాన్ని ప్రభుత్వం అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో జన జాగరణ సమితి నగర కన్వీనర్ సునీల్‌కుమార్, నాయకులు దేవర శంకర్, జి.వి.ఎస్.సంజయ్, కృష్ణ, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన ఎన్‌ఐఆర్‌ఎఫ్ కమిటీ



ఏయూ వీసీ, ఇతర ప్రొఫెసర్లతో సమావేశమైన ఎన్‌ఐఆర్‌ఎఫ్ బృందం

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఏర్పాటు చేసిన ఎన్‌ఐఆర్‌ఎఫ్ నిపుణుల కమిటీ బృందం బుధవారం సందర్శించింది. ముందుగా పాలక మండలి సమావేశం మందిరంలో ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణ రావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఇతర అధికారులతో కమిటీ సభ్యులు ఆచార్య జుబైదా అన్సారి, డాక్టర్ రమా కొండపల్లి, డాక్టర్ ప్రశాంత్ ఆర్.నాయర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఐక్యూఏసీ సమన్వయకర్త ఆచార్య గిరిజా శంకర్ ఏయూ ఐక్యూ ఏసీ కేంద్రం పనిచేస్తున్న విధానం తదితర అంశాలను వివరించారు. అనంతరం కమిటీ సభ్యులు ఏయూ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ కమిటీ, టాస్క్‌ఫోర్స్ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్‌కు ఏయూ అనుసరిస్తున్న విధానం తదితర అంశాలను వీరికి ఆచార్య గిరిజా శంకర్ వివరించారు. అనంతరం కమిటీ సభ్యులు ఏయూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఇన్నోవేషన్ సెంటర్, నానో టెక్నాలజీ సెంటర్, నార్త్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ సెల్, అవంతి ఆక్వా కల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఫుడ్ డ్రగ్ టెస్టింగ్ లేబరేటరీ, అమెరికన్ కార్నర్, అలుమ్ని అసోసియేషన్ ఆఫీస్, డీన్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ ఆఫీస్, సౌత్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఆఫీస్, డాక్టర్ వి.ఎస్.కృష్ణ సెంట్రల్ లైబ్రరీలను సందర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎ.నరసింహారావు ఎం.వి.ఆర్.రాజు, డి.నాగరాజా కుమారి, పద్మశ్రీ, సీతామాణిక్యం, అకడమిక్ డీన్ ఆచార్య కె.ఈశ్వర్ కుమార్, రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్ ఆచార్య బసవయ్య, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



12వ వార్డులో కార్మికులకు దుస్తులు అందజేస్తున్న కార్పొరేటర్ రోహిణి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో పారిశుధ్య కార్మికులకు బుధవారం దుస్తుల పంపిణీ కార్యక్రమం జరిగింది. గత నెలలో తుపాను కారణంగా ముంపునకు గురైన విజయవాడ ప్రాంతాల్లో సేవలందించిన విశాఖ పారిశుధ్య కార్మికులకు జీవీఎంసీ దుస్తులు అందిస్తోంది. 12వ వార్డు నుంచి విజయవాడ వెళ్లి సేవల చేసిన 12 మంది పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి దుస్తులు అందజేసి అభినందించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వంటగ్యాస్ వినియోగంపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఏయూక్యాంపస్: వంటగ్యాస్ వినియోగంలో మహిళలు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలని ఇండేన్ గ్యాస్ వాణిజ్య విభాగం అధికారి ఆదిత్య ప్రభు అన్నారు. బీచ్ రోడ్డులోని జీవీపీ ఎంఎల్‌బీటీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు వంటగ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించారు. గ్యాస్ వినియోగించే సమయంలో సప్త సూత్రాలను కనీస పరిజ్ఞానంపై అవగాహన అవసరమని ఆయన చెప్పారు. హైదరాబాద్ రీజియన్ అధికారి సుభాన్ మాట్లాడుతూ సాధారణ వినియోగదారులతోపాటు వాణిజ్య అవసరాలకు కూడా ఐఓఎల్ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్యాస్ వినియోగంపై ఆడియో, వీడియో చూపుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ద్వారకామయి ఏజెన్సీస్ అధినేత తేజ గాయిత్రి, పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

71 మంది ఎస్సీ మహిళలకు రుణ అవకాశం

ఎంవీపీకాలనీ: ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ పథకం(పీఎంఏజేఏవై)లో భాగంగా సెర్ప్ డీఆర్‌డీఏ ద్వారా ఎస్సీ కార్పొరేషన్ ఉమ్మడి విశాఖ జిల్లాలో 71 మంది ఎస్సీ మహిళలకు రుణాలు అందజేయనుంది. వీటికి అర్హులైన వారి నుంచి ఇటీవల కార్పొరేషన్ దరఖాస్తులను ఆహ్వానించిన విషయం తెలిసిందే. డ్వాక్రా, సూక్ష్మ, చిన్న తరహా వ్యాపారాలకు రూ.1 లక్ష నుంచి రూ.3 లక్షల వరకు రుణం అందించనున్నారు. ఇందులో రూ.50 వేలు సబ్సిడీ ఉండగా.. మిగతా రూ.2.5 లక్షల రుణాన్ని వడ్డీ లేకుండా చెల్లించాల్సి ఉంటుంది. ఈ రుణాలకు విశాఖ జిల్లా నుంచి 36 మందిని, అనకాపల్లి జిల్లా నుంచి 31 మందిని, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి నలుగురిని ఎంపిక చేయనున్నట్లు కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు. దరఖాస్తుకు ఈ నెల 30 చివరి తేదీగా ప్రకటించారు.

జైల్ ఆవరణలో పెట్రోల్ బంక్ ఏర్పాటులో కదలిక



జైల్ ఆవరణలో పెట్రోల్ బంక్ కోసం స్థలం పరిశీలిస్తున్న అధికారులు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్వహణకు మళ్లీ కదలిక వచ్చింది. సుమారు ఏడేళ్ల కిందట సెంట్రల్ జైల్ ఆవరణలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి అధికారులు సన్నాహాలు చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో దీని నిర్వహణ కోసం స్థలం వ్యవహారంలో జైల్ అధికారులు, జీవీఎంసీ అధికారుల మధ్య సమన్వయ లోపం, ఐఓసీఎల్ సంస్థ ముందుకు రాకపోవడం తదితర కారణాల వల్ల పెట్రోల్ బంక్ ఏర్పాటుకు బ్రేక్ పడింది. అప్పట్లో దానికి సంబంధించిన ఫైల్ మూలన పడింది. ఇప్పుడు మళ్లీ దానికి అధికారులు కదలికను తీసుకొచ్చారు. శ్రీకాకుళం జిల్లా జైల్ సూపరింటెండెంట్ సన్యాసిరావును దీని కోసం మోనటరింగ్ చేయడానికి జైల్ అధికారులు నియమించారు. గత నెల నుంచి ఆయన సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఐఓసీఎల్ ప్రతినిధులతో కలసి సన్యాసిరావు విశాఖ కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఇక్కడ బీఆర్‌టీఎస్ రహదారిని ఆనుకొని జైల్ స్థలంతోపాటు దాని పక్కనే ఉన్న సుమారు ఒకటిన్నర ఎకరాల జీవీఎంసీ స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈమేరకు సమావేశం నిర్వహించారు. గురువారం కూడా విశాఖ జైల్ అధికారులు, ఐఓసీఎల్ ప్రతినిధులతో కలసి సమావేశం నిర్వహిస్తామని సన్యాసిరావు తెలిపారు. గత నెలలో కూడా రెండు రోజుల పాటు ఐఓసీఎల్ ప్రతినిధులతో కేంద్ర కారాగారాన్ని సందర్శించి దీనికి సంబంధించిన సమావేశం నిర్వహించామన్నారు.

ప్రత్యేక పాఠశాలలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న వెంకట శేషమ్మ

బీచ్‌రోడ్డు: మానసిక దివ్యాంగ బాలల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సివిల్ జడ్జి వెంకట శేషమ్మ సూచించారు. పెదవాల్తేరులోని సన్‌ఫ్లవర్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. సంస్థలో చదువుతున్న మూగ, చెముడు విద్యార్థులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మానసిక, శారీరక, ఈఎన్‌టీ సమస్యలపై పరీక్షలు చేశారు. కార్యక్రమంలో చినవాల్తేరు ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శ్రీరమ్య, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ శ్వేతారావు, సనఫ్లవర్ సంస్థ ప్రిన్సిపాల్ కృష్ణవేణి పాల్గొన్నారు.

డాక్టర్ మణిభూషణ్‌కు ఆత్మీయ సత్కారం



డాక్టర్ మణిభూషణ్‌ను సత్కరిస్తున్న ఎన్‌జీ రంగ విశ్వవిద్యాలయం అధికారులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీకి చెందిన డాక్టర్ మణిభూషణ్‌కు కిసాన్ మేళా–2024 ఆత్మీయ సత్కారం లభించింది. శ్రీకాకుళం జిల్లా రాగోలు లోని ఆచార్య ఎన్‌జీ రంగ అగ్రికల్చర్ రీసెర్చ్ సెంటర్ వేదికగా ఇటీవల ఈ మేళా నిర్వహించారు. అగ్రికల్చర్ టూరిజంపై విస్తృత పరిశోధనలు చేసినందుకు గాను డాక్టర్ మణిభూషణ్‌ను ఘనంగా సత్కరించారు. గతంలో ఆయా పరిశోధనలకు గాను ఆచార్య ఎన్‌జీ రంగ విశ్వవిద్యాలయం నుంచి పలు అవార్డులు అందుకున్నారు. వ్యవసాయ, అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి కృషి చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయనకు పలువురు నగర ప్రముఖులు, విద్యావేత్తలు అభినందనలు తెలిపారు.

ఘనంగా క్షీరాబ్ది ద్వాదశి పూజలు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో బుధవారం క్షీరాబ్ది ద్వాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ, రామకృష్ణ శర్మ, సుబ్రహ్మణ్య శర్మలు భక్తుల నుంచి స్వయంపాకాలు స్వీకరించి, వారిని ఆశీర్వదించారు.

ముగిసిన పాండురంగ స్వామి ఉత్సవాలు

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వార్షికోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా లక్ష తులసి అర్చన నిర్వహించారు.

ఏయూకు రుణపడి ఉంటా..



మాట్లాడుతున్న వెస్ట్ ఏసీపీ నరసింహమూర్తి

విశాఖ విద్య: తల్లిదండ్రులు జన్మనిస్తే.. ఆంధ్ర విశ్వవిద్యాలయం జీవితాన్ని ఇచ్చిందని వెస్ట్ సబ్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ అన్నెపు నరసింహమూర్తి అన్నారు. ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన బియాండ్ ది బ్యాడ్జ్ పబ్లిక్ సేఫ్టీ లీడర్ షిప్ అండ్ లైఫ్ ఇన్ యూనిఫాం కార్యక్రమంలో ఆయన పాల్గొని తన మనసులోని భావాలను పంచుకున్నారు. దేశం గర్వించే మహోన్నతులను తయారు చేసిన ఏయూలో ఉన్నత విద్యనభ్యసించి జీవితంలో పైకి ఎదగానని, చదువుల తల్లి ఏయూకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. విద్యార్థుల సంధించిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం చెబుతూ అత్యంత వెనుక బడిన ప్రాంతం నుంచి వచ్చిన తాను ఏయూలో ఉన్నత విద్యను అభ్యసించి డాక్టరేట్ కూడా పొందానని గుర్తుచేశారు. పోలీస్ విధి నిర్వహణలో ఒత్తిళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలకు మంచి సేవలు చేయడంలోనే ఆత్మ సంతృప్తి ఉంటుందన్నారు. విశాఖ నగరంలో యువత సోషల్ మీడియా వలలోనూ, మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా బాగా చదువుకుని తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని ఏసీపీ ఆకాంక్షించారు. జీవితంలో పైకి ఎదగడానికి పబ్లిక్ రిలేషన్స్ కూడా ముఖ్యమే నన్నారు. పలువురు ఏయూ పూర్వ, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.